క్లుప్తంగా

అన్నమాచార్యుల కీర్తనల ఉచిత శిక్షణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం శ్రీ అలమేలు మంగ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో బుధవారం హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో చిన్నారులు, మహిళలకు అన్నమాచార్యుల కీర్తనలు, సంగీత ఉచిత శిక్షణ కార్యక్రమం జరిగింది. భక్తులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం అయ్యప్పస్వామి మందిరంలో బుధవారం శ్రీ మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. బల్లెం పూర్ణయ్య గురుస్వామి స్వామి వారికి విశేషంగా తేనె, పంచదార, నెయ్యి, పాలు, పెరుగు, పంచామృత అభిషేకం, పుష్పార్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, అయ్యప్పలు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప పారాయణం జరిగింది. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ



విజయవాడస్పోర్ట్స్: విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద నిరాశ్రయులైన వారికి అరవిన్ ఫౌండేషన్ బుధవారం దుప్పట్లను పంపిణీ చేసింది. ఫౌండేషన్ సమకూర్చిన ఈ దుప్పట్లను వెనుకబడిన, సంచార జాతుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.సి.చెన్నయ్య, అరవిన్ ఫౌండేషన్ సభ్యుడు బద్వేలు గురుమూర్తి నిరాశ్రయులకు అందజేశారు. దేశంలోని నిరుపేదలకు సాయం చేయాలనే ఉద్దేశంతో ఎన్ఆర్ఐలు అరుణ, రవి, విన్ని ఈ ఫౌండేషన్‌ను స్థాపించారని చెన్నయ్య, గురుమూర్తి తెలిపారు. ఉద్యోగ రీత్యా వారు అమెరికాలోని న్యూజెర్సీలో స్థిరనివాసం ఉంటూ మాతృభూమి రుణం తీర్చుకోవడానికి చేస్తున్న సాయాన్ని అభినందించారు. కార్యక్రమంలో బీసీ చైతన్య సమితి జాతీయ అధ్యక్షుడు రమణ, బీసీ సంక్షేమ సంఘం బద్వేలు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఎం.జయరాముడు పాల్గొన్నారు.

భవానీలకు అమ్మ ఫ్రెండ్స్ వితరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): గిరి ప్రదక్షిణ చేస్తున్న భవానీ దీక్షాపరులకు అమ్మ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో విద్యాధరపురం అప్పలస్వామి క్వారీ సెంటర్‌లో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. మొత్తం ఐదు రోజులు 24 గంటల పాటు భక్తులకు 18 రకాల ప్రసాదాలను అందించామని అమ్మ ఫ్రెండ్స్ సర్కిల్ ప్రధాన కార్యదర్శి వెంపరాల వెంకట భాస్కర్ తెలిపారు. దీక్ష విరమణలో చివరి రోజైన బుధవారం 108 మంది దంపతులతో చండీ హోమం నిర్వహించామన్నారు. పుష్కర కాలం కిందట ఏర్పాటు చేసిన తమ సంస్థ దాతల సహకారంతో అమ్మవారి సేవలో తరిస్తున్నామని చెప్పారు.

క్రీస్తు జననం.. లోకానికి శుభోదయం

- నియోజకవర్గంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- వాడవాడలా క్రీస్తు ఆరాధనలు
- వేలాదిగా పాల్గొన్న క్రీస్తు విశ్వాసులు



సీమోను ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ సందేశం వివరిస్తున్న రెవరెండ్ డాక్టర్ కనమాల వరప్రసాద్



నిర్మలా కాన్వెంట్ రోడ్డులోని చర్చిలో భక్తులకు దివ్యసత్ప్రసాదం అందిస్తున్న ఫాదర్



క్రిస్మస్ సందేశం వివరిస్తున్న రెవరెండ్ డాక్టర్ బందెల దయానందం



ప్రార్థనలు చేస్తున్న మహిళలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో బుధవారం వాడవాడలా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం అర్థరాత్రి నుంచే పలు చర్చిలలో క్రీస్తును స్తుతిస్తూ ప్రార్థనలు చేశారు. మధురానగర్, ముత్యాలంపాడు, రామకృష్ణాపురం, దేవీనగర్, అంబేద్కర్ కాలనీ, మాచవరం తదితర ప్రాంతాల్లో చర్చిలు విశ్వాసకులతో కళకళలాడాయి. చిన్నా, పెద్ద తారతమ్యం లేకుండా భక్తిశ్రద్ధలతో క్రీస్తును స్తుతిస్తూ కీర్తనలు ఆలపించారు. కేక్‌లు కట్ చేసి పరస్పరం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

అంబేద్కర్ కాలనీలో...

31వ డివిజన్ అంబేద్కర్ కాలనీ సీమోను ప్రార్థన మందిరంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు కనుల పండువగా జరిగాయి. పెద్ద సంఖ్యలో విశ్వాసకులు చర్చిలలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా రెవరెండ్ డాక్టర్ కనమాల వరప్రసాద్ క్రీస్తు సందేశం ఇచ్చారు. అనంతరం విశ్వాసకులకు ప్రేమవిందు జరిగింది.

మధురానగర్‌లో...

29వ డివిజన్ మధురానగర్ కొబ్బరితోట జీసస్ ప్రేయర్ ఫెలోషిప్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి, రెవరెండ్ డాక్టర్ బందెల దయానందం క్రీస్తుజీవిత విశేషాలను తెలియజేశారు. అనంతరం నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బి.విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపురంలో...

30వ డివిజన్ రామకృష్ణాపురం రఘునాథరావు వీధిలోని ఫుల్ గాస్పల్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. రెవరెండ్ డాక్టర్ డానియేల్ క్రిస్మస్ సందేశం వివరించారు. ప్రతి ఒక్కరూ క్రీస్తును భక్తితో సేవిస్తే సకల కష్టాలు తీరుతాయని అన్నారు. ప్రభువైన ఏసుక్రీస్తుపై భారం వేసి తోచినంతలో సేవా కార్యక్రమాలు చేయాలని అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు, నూతన సంవత్సర క్యాలెండర్‌లు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో విశ్వాసకులు క్రిస్మస్ వేడుకలలో పాల్గొని ప్రార్థనలు చేశారు.

పసుపుతోటలో...

చర్చ్ ఆఫ్ గాడ్ ఆధ్వర్యంలో వేడుకలు మనోరంజకంగా జరిగాయి. పాస్టర్ ఎస్.డానియల్ సర్వజనావళి ఆయురారోగ్యాలతో జీవించాలంటూ విశ్వాసుల కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్ కట్‌చేసి స్వీట్లు పంచి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

దేవీనగర్‌లో...

మధురానగర్ మెయిన్ రోడ్డు ఏసుక్రీస్తు ప్రార్థన మందిరంలో పాస్టర్ గంజి విక్టర్ పాల్ క్రిస్మస్ సందేశం క్రిస్మస్ విశిష్టతను తెలియజేశారు. విశేష సంఖ్యలో విశ్వాసకులు చర్చిలో ప్రార్థనలు చేశారు.

కార్మికవాడలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ఆటోనగర్(విజయవాడతూర్పు): కార్మికవాడలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రీస్తు విశ్వాసులు నూతన వస్త్రాలు ధరించి ప్రార్థనా మందిరాలకు వెళ్లి క్రిస్మస్ ఆరాధనలో పాల్గొన్నారు. వంద అడుగుల రోడ్డులోని మెస్సీయ ఫెలోషిప్ చర్చిలో క్రిస్మస్ పండుగ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన వివిధ క్రైస్తవ నాటకాలు ఆకట్టుకున్నాయి. యేసుక్రీస్తు 12 మంది శిష్యుల పాత్రలకు సంబంధించి చిన్నారులు వివిధ వేషధారణలతో ఆయన జీవితాన్ని అందరికీ అర్థమయ్యేలా వివరించారు. అనంతరం పలువురు క్రైస్తవులు క్రిస్మస్ పాటలు ఆలపించారు. ప్రత్యేక ఆరాధన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాస్టర్ డాక్టర్ సజ్జా రత్నకుమార్ మాట్లాడుతూ యేసుక్రీస్తు మానవులకు శాంతి, సమాధానం ఇవ్వడానికి పరలోకం నుంచి ఈ భువికి అరుదెంచినాడని అన్నారు. ఆయన రాకతో ప్రతి ఒక్కరికీ రక్షణ వచ్చిందన్నారు. క్రిస్మస్ ప్రత్యేక ఆరాధన కార్యక్రమానికి విజయవాడ చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రవికిషోర్, కోటేశ్వరరావు, ప్రబోధకుమార్, జోయెల్, సజ్జా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

లబ్బీపేటలో...

లబ్బీపేట(విజయవాడతూర్పు): యేసుక్రీస్తు సందేశానుసారం నడుస్తూ ఇతరుల పట్ల ప్రేమ, దయ, క్షమా గుణాలు కలిగి ఉండాలని లైఫ్ చేంజింగ్ రివైవల్ మినిస్ట్రీస్ ఫౌండర్ రెవరెండ్ పీజే స్టీఫెన్ పాల్ అన్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని నగరంలోని ఎం.కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ప్రత్యేక ఆరాధన జరిగింది. ఈ ఆరాధనలో నగరం నుంచే కాకుండా ఉభయ కృష్ణాజిల్లాల నుంచి వేలాది మంది క్రీస్తు విశ్వాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్చువల్‌లో రెవరెండ్ పీజే స్టీఫెన్‌పాల్ క్రిస్మస్ ప్రత్యేక సందేశం ఇచ్చారు. యేసుక్రీస్తు అందరినీ క్షమించిన రీతిగా మీరును ఒకరినొకరు క్షమించుకోవాలన్నారు.



పటమట నిర్మలా కానెంట్ రోడ్డులో ఉన్న చర్చిలో కొవ్వొత్తులు వెలిగిస్తున్న భక్తులు



గుణదల చర్చిలో ప్రార్థనలు చేస్తున్న యువతులు

రేపు ధర్నాచౌక్‌లో వైఎస్సార్ సీపీ పోరుబాట

వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల బాదుడుపై ఈనెల 27వ తేదీన ధర్నా చౌక్‌లో నిర్వహించ తలపెట్టిన వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో లక్షా 30వేల విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయన్నారు. చార్జీలు పెంచబోమంటూ చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం యూనిట్‌కు రూ.1.20 చొప్పున భారం మోపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలే పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో అల్లాడుతున్న ప్రజలు ఇప్పుడు విద్యుత్ చార్జీల పెంపు వల్ల రెట్టింపునకు పైగా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రజలపై వందల కోట్ల భారం మోపుతున్న కూటమి ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ శుక్రవారం ఉదయం 9 గంటలకు ధర్నాచౌక్‌లో నిర్వహిస్తున్న పోరుబాటకు విద్యుత్ గృహ, వాణిజ్య వినియోగదారులు, ఇండస్ట్రియల్ వినియోగదారులు, చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపారులు స్వచ్ఛందంగా తరలి రావాలని మల్లాది విష్ణు కోరారు.

ఘాట్లలో దీక్ష వస్త్రాల తొలగింపు వేగవంతం చేయాలి

పటమట(విజయవాడతూర్పు): భవానీ దీక్షల విరమణ ఆఖరి రోజు భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నందున వీఎంసీ సిబ్బంది ఘాట్లలో దీక్ష వస్త్రాల తొలగింపు పనులను వేగవంతం చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఆయన బుధవారం తెల్లవారుజామున భవాని దీక్ష విరమణ ఏర్పాట్లను కృష్ణవేణి ఘాట్, సీతమ్మ పాదాలు, హోల్డింగ్ ఏరియా, వినాయకుని గుడి, కెనాల్ రోడ్, దుర్గా ఘాట్, మోడల్ గెస్ట్ హౌస్ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవాని దీక్ష విరమణకు వచ్చిన భక్తులు అధికంగా ఉండటంతో రాత్రి వేళలో కూడా భక్తులకు కల్పించే సౌకర్యాల్లో ఎలాంటి అవాంతరాలు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఘాట్లలో భక్తులు విడిచిన దీక్ష వస్త్రాలను ఎప్పటికప్పుడు తొలగించి కన్వేయర్ బెల్ట్ ద్వారా ఒడ్డుకు చేరి అక్కడి నుంచి తరలించాలని ఆదేశించారు. వస్త్రాలను తరలించే వాహనాల సంఖ్య కూడా పెంచాలని, భక్తులకు కల్పించే తాగునీటి సరఫరాలో కూడా అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు ఎప్పటికప్పుడు తాగునీటి స్టాక్ పాయింట్ పరిశీలించాలని, వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లను పూర్తి స్థాయిలో సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన దుర్గా ఘాట్ వద్ద గల మోడల్ గెస్ట్ హౌస్‌లో ఉన్న కంట్రోల్ రూమ్‌లో ఉండే సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరా ద్వారా జరుగుతున్న పనిని పరిశీలించారు.



కృష్ణవేణి ఘాట్‌లో ఏర్పాటు చేసిన కన్వేయర్ బెల్ట్ వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

కాకాని సేవలు చిరస్మరణీయం

లబ్బీపేట(విజయవాడతూర్పు): స్వాతంత్ర్య సమర యోధుడు, జై ఆంధ్ర ఉద్యమనేత, మాజీ మంత్రి కాకాని వెంకటరత్నం వర్ధంతి సభ బుధవారం బెంజిసర్కిల్‌లోని ఆయన విగ్రహం వద్ద జరిగింది. తొలుత పలువురు నేతలు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్రాను ప్రత్యేక రాష్ట్రంగా విభజించాలని డెబ్బయ్యవ దశకంలోనే కాకాని డిమాండ్ చేశారని, అప్పుడే అలా జరిగితే ఇప్పటికి రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెంది ఉండేదన్నారు. మాజీ ఎమ్మెల్యే యలమంచిలి రవి మాట్లాడుతూ బెంజిసర్కిల్‌కు కాకాని సర్కిల్‌గా నామకరణ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాకాని ఆశయ సాధన సమితి అధ్యక్షుడు తరుణ్ కాకాని, మాజీ ఎమ్మెల్యే ముసునూరి రత్నబోస్, సెంటర్ ఫర్ మీడియా స్టడీస్(న్యూఢిల్లీ) చైర్మన్ నాగులపల్లి భాస్కరరావు, కలపాల వినయ్ సాగర్, గోగినేని ధనశేఖర్ పాల్గొన్నారు.

దోమల కేంద్రాలు.. ఖాళీ స్థలాలు

- అనారోగ్య కారకాలుగా మారుతున్న వైనం
- వరదల అనంతరం విషసర్పాల బెడద సైతం
- అధికారులకు విన్నవించినా చర్యలు శూన్యం

పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ నగర శివారులోని పాయకాపురం, కండ్రిక, రాజీవ్ నగర్, ప్రజాశక్తి నగర్, వడ్డెర కాలనీల్లో పలు ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు అనారోగ్యకారకాలుగా మారుతున్నాయి. సంవత్సరాల తరబడి ఖాళీ స్థలాలు అలాగే వదిలి వేయడంతో మురుగు, వ్యర్థాలకు ఆవాసాలుగా మారాయి. విజయవాడ నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో శివారు ప్రాంతాల్లో స్థలాలు కొనుగోలు చేసిన కొందరు వ్యాపారులు ఏళ్ల తరబడి ఆ స్థలాలను అలాగే ఖాళీగా ఉంచేశారు. అపార్టుమెంట్లు, గ్రూప్ హౌస్‌ల నిర్మాణాలు పెరిగిపోవడంతో ఈ ప్రాంతాల్లో నివాసాలు ఉండేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. వ్యాపారవర్గాలు, ఉద్యోగులు, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు చేసుకునే వారు సైతం అధిక సంఖ్యలో నివాసం ఉంటున్నారు. అయితే నివాసాల మధ్య ఖాళీ వుంటున్న స్థలాల్లోకి మురుగునీరు వచ్చి చేరడంతో ఇటీవల వచ్చిన వరదల కారణంగా పాములు లాంటి విషసర్పాలు కూడా ఆ మురుగు నీటిలో ఉండటంతో ప్రజలు భయపడుతున్నారు. జనసంచారం లేని సమయంలో రాత్రి వేళ పాములు బయటకు రావడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లల్లోకి కూడా వస్తున్నాయంటున్నారు. బుడమేరు వరదలు పోయినా వరదల కారణంగా వచ్చిన జ్వరాలు, కీళ్ల నొప్పులు బాధలు ఇంకా వదలక ప్రజలు నానా బాధలు పడుతున్నారు. దానికి తోడు దోమలు స్వైరవిహారం చేయడంతో వైరల్ ఫీవర్స్ ప్రజానీకాన్ని అనారోగ్యాల బారిన పడవేస్తున్నాయి. ఖాళీ స్థలాల బాగోగులు పట్టించుకోకపోవడంతో ఏపుగా పిచ్చి మొక్కలు పెరిగి మురుగు నీరు నిల్వ వుండి బురదమయంగా మారడంతో ఖాళీ స్థలాల్లో పందులు కూడా సంచరిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.



రాజీవ్‌నగర్‌కు వెళ్లే రోడ్డులో నీటితో వున్న ఖాళీ స్థలం

అధికారుల చర్యలు శూన్యం

ఖాళీ స్థలాల యజమానులతో చెప్పి మెరక చేయించాలని, గోతులు పూడ్పించమని అనేక దఫాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. స్థల యజమానులు స్థలాలను వచ్చి చూసుకొని వెడుతున్నారు తప్ప వాటిని మెరక చేసుకునేందుకు ఆసక్తి చూపడం లేదంటున్నారు. ఆయా ప్రాంతాల్లో ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి మెరక చేయించుకునేలా అధికారులు నోటీసులు జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

దోమల బెడద బాగా ఉంది



నివాస గృహాల మధ్య ఖాళీ స్థలాలు ఉండటం వలన దోమల బెడద అధికంగా వుంది. రాత్రి సమయాల్లో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో పిల్లలు, పెద్దలు తేడా లేకుండా అందరం రోగాల బారిన పడుతున్నాం.

–ఎస్.వెంకటేశ్వరరావు, కండ్రిక

ఖాళీ స్థలాలు మెరక చేయించాలి



ఇటీవల వచ్చిన వరదల కారణంగా దోమలతో పాటు విషసర్పాల బెడద ఉంది. రోగాల బారిన పడి నానా అవస్థలు పడుతున్నాం. మా ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు మెరక చేయించేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

–బి.ఈశ్వరయ్య, రాజీవ్‌నగర్

నేడు ఏఐటీయూసీ వందేళ్ల సంబరాలు

పటమట(విజయవాడతూర్పు): కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారానికి శ్రమిస్తున్న ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఏఐటీయూసీ) శత వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నామని ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బూదే రాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం 10.30 గంటలకు విజయవాడ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద పతాక ఆవిష్కరణ జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు, సీపీఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు ప్రధాన అతిథిగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమానికి వీఎంసీ కార్మికులందరూ హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

భవానీల సేవలో ఎన్ఎస్ఎస్ వలంటీర్‌లు



భవానీ దీక్షల విరమణ కార్యక్రమంలో సేవలందించిన ఎన్ఎస్ఎస్ వలంటీర్‌లు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇంద్రకీలాద్రి ఆలయంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భవానీ దీక్షల విరమణ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 200 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవలు అందించినట్లు ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 నుంచి 25 వరకు నిర్వహించిన భవానీ దీక్షల విరమణ సేవలో భక్తులకు సేవలు అందించేందుకు గాను జిల్లా కలెక్టర్ ఆహ్వానం మేరకు ఎన్ఎస్ఎస్ వలంటీర్‌లు క్యూలైన్‌లో నియంత్రణ, అన్న ప్రసాదాల వితరణ, వికలాంగులకు సేవలు, తాగు నీటి సరఫరా, వైద్య సేవలను అందించారని తెలిపారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలను దేవస్థానం అధికారులు ప్రశంసించినట్లు తెలిపారు.

గిరి ప్రదక్షిణలో దేవతా మూర్తులు



విద్యాధరపురం చెరువు సెంటర్‌లో..



చెరువు సెంటర్‌లో ఆలయ సెట్టింగ్

విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్ నుంచి కబేళా సెంటర్ వరకు వివిధ సేవా సంస్థలు, భక్తులు భారీ సెట్టింగ్‌లలో ఏర్పాటు చేసిన ఉత్సవ విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. కనకదుర్గ అమ్మవారి విగ్రహాన్ని కేంద్రంగా చేసుకుని విఘ్నేశ్వరుడు, వారాహి మాత, వేంకటేశ్వరస్వామి, శివ పార్వతులు తదితర ఉత్సవ మూర్తుల విగ్రహాలతో కూడిన సెట్టింగ్‌లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. గిరి ప్రదక్షిణ చేస్తున్న భవానీలు, వారిని అనుసరిస్తూ వచ్చే బంధువులు, సన్నిహితులు దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాల వద్ద ఆగి దుర్గమ్మకు నమస్కరించుకుని వెళ్తున్నారు. నిర్వాహకులు భవానీ భక్తులకు అమ్మవారి ప్రసాదాలు, అల్పాహారం, పండ్లు, పాలు, భోజనాలు పంపిణీ చేస్తున్నారు.

– భవానీపురం(విజయవాడపశ్చిమ)



క్వారీ సెంటర్‌లో అమ్మవారి విగ్రహాలు



కబేళా సెంటర్‌లో